# సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 11 | జులై | 2023






## సమష్టి కృషితోనే ఏ ప్లస్ గ్రేడ్

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తో కాకతీయ యూనివర్సిటీకి భారీ ప్రయోజనం చేకూర్చుతుందని వీసీ తాటికొండ రమేష్ అన్నారు.

- 8లో▸



## ఆ పాప ఎవరు..?

అమెరికా దంపతులు వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దత్తత తీసుకునే అంశం సంచలనం సృష్టిస్తోంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/24^0$

## వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి ర్యాంకు



**కేయూ క్యాంపస్:** హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థి కె.శివ జాతీయ స్థాయిలో నిర్వహించిన నిమ్‌సెట్‌లో ర్యాంకు సాధించారు. వరంగల్ నిట్‌లోని ఎంసీఏలో సీటు సాధించారని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, గణిత విభాగం అధ్యాపకులు టి.నాగయ్య, రవికుమార్, మంజుల, శ్రీలక్ష్మి తదితరులు విద్యార్థి శివను అభినందించారు.

### రుద్రేశ్వరాలయంలో కేయూ వీసీ పూజలు



**హన్మకొండ కల్చరల్:** కాకతీయ విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిన సందర్భంగా కేయూ వీసీ తాటికొండ రమేష్ దంపతులు సోమవారం రుద్రేశ్వరాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం మహామండపంలో తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

### గీత కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలి




**హన్మకొండ అర్బన్:** మునుగోడు ఎన్నికల సందర్భంగా గౌడ ఆత్మీయ సమావేశంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బీసీ వృత్తిదారులకు ఇచ్చే రూ.లక్ష పథకాన్ని గీత కార్మికులకు కూడా వర్తింజేయాలన్నారు. ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి సేఫ్టీ మోకు ఉచితంగా ఇవ్వాలని, వృత్తి నిర్వహణకు ద్విచక్ర వాహనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మెరుగు వీరస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లాల గంగాధర్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కక్కెర్ల భిక్షపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు బుర్ర రాజన్ గౌడ్, జనగాం భిక్షపతి, రవీందర్, సంజీవ్, వెంకన్న, స్వామి తదితరులు ల్గొన్నారు.

### వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

**కాజీపేట అర్బన్:** వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ డైరెక్టర్ రాము యాదవ్ అన్నారు. న్యూశాయంపేటలోని వికాస్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్ఐఎఫ్‌డీ హైదరాబాద్ అందిస్తున్న ఫ్యాషన్, ఇంటీరియర్, గ్రాఫిక్ డిజైనింగ్స్, ఫొటోగ్రఫీ డిప్లొమా, డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, వాటిలో చేరి ఉద్యోగావకాశాలు పొందాలని సూచించారు.

### విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన



**గీసుకొండ:** గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) సారయ్య సోమవారం సందర్శించారు. పఠనోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన తరగతి గదుల్లో విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించారు. హెచ్ఎం సుజాత పాల్గొన్నారు.

# అమ్మో దోమ!



సాకరాశికుంట నివాసాల నడుమ నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీటిపై దోమలు

- సార్ నమస్తే.. మా సాకరాశికుంటలో ఫాగింగ్ చేసి మూడు నెలలైంది. దోమల బెడదతో రాత్రి పూట నిద్ర ఉంటలేదు. పిల్లలకు జ్వరాలొచ్చి మంచం పడుతున్నారని ఇండ్ల రవి ఆవేదన.

- మూడు రోజులకోమారు ప్రతి కాలనీలో ఫాగింగ్ చేయాలని మా కార్మికులకు చెప్పాను.. మళ్లీ చెప్పి ఈ రోజే పంపిస్తా.. బయలాజిస్టు మాధవరెడ్డి మాట.

- ఇలా మురికివాడల్లో నివసించే ప్రజలు వందల సంఖ్యలో డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడుతున్నారు. బల్దియా మలేరియా విభాగం సిబ్బంది మాత్రం 16 మందికి డెంగీ, ఆరుగురికి మలేరియా సోకిందంటూ లెక్కలు చెబుతున్నారు. వాస్తవానికి.. జ్వరాలతో కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరికొందరు ఇళ్లల్లో మంచాలపై మగ్గుతున్నారు.

### 16 డెంగీ, 6 మలేరియా కేసులు

- పత్తాలేని ఫాగింగ్.. విజృంభిస్తున్న దోమలు
- వేల సంఖ్యలో జ్వరాల బారిన ప్రజలు, ఆస్పత్రుల్లో చికిత్స
- నివారణ పేరుతో ఏటా రూ.2కోట్లు భోజ్యం
- సీజనల్ వ్యాధులపై అవగాహన కరువు
- వరంగల్ నగర వాసులకు తప్పని బాధలు

**వరంగల్ అర్బన్:** ప్రస్తుతం నగరంలో ఏ వీధికెళ్లినా దోమల గురించే మాట్లాడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నగరవాసుల్ని ఎడా పెడా కుట్టేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. ఈగల సైజులో ఉన్న దోమలు వీరవిహారం చేస్తూ జనం రక్తాన్ని పీల్చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగేలా చేస్తున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే నగర పాలకులు, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. పొద్దంతా ఎండ మండిపోతుండగా.. సాయంత్రం చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దోమలు జనం మీద దండెత్తుతున్నాయి.

**ఫాగింగ్ చేసి మూడు నెలలు..**

నగర పరిధిలోని 66 డివిజన్లకు 60 హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు, 4 పెద్ద మిషన్లు, 4 చిన్న మిషన్లు ఉన్నాయి. ఒక్కో పెద్ద మిషన్‌కు రోజుకు 55 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోల్, చిన్న మిషన్లకు 30 లీటర్ల డీజిల్, 3 లీటర్ల పెట్రోల్, హ్యాండ్ మిషన్‌కు 5 లీటర్ల డీజిల్, లీటర్ పెట్రోలు ఖర్చు చేస్తున్నారు. వీటితో నిత్యం కేవలం గంట పాటు మాత్రమే కాలనీల్లో ఫాగింగ్ చేస్తారు. అంతకు మించిన సమయం ఫాగింగ్ చేస్తే మిషన్లు పాడైపోతాయి. ఈ ఫాగింగ్, రసాయనాల పేరిట ఏటా రూ.2.25కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారు. దోమల నివారణకు ఇంత పెద్ద మొత్తంలో వెచ్చిస్తున్నా.. ప్రజలకు వాటి బెడద తప్పడంలేదు. ప్రధానంగా నాలాలు, డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలు, ముళ్లపొదలు, వ్యర్థాలు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి.

**సిబ్బంది ఉన్నా నివారణ మొక్కుబడే..**

### సీజనల్ వ్యాధులపై అవగాహన కరువు

వర్షాకాలం ఆరంభం కాకముందే గతంలో ప్రతి ఏడాది మే, జూన్ నెలల్లో సీజనల్ వ్యాధులపై మురికివాడల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారు. దోమల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ ఆరోగ్య శిబిరాలను బల్దియా ఏర్పాటు చేస్తుండేది. అయితే ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై అవగాహన, ఆరోగ్య శిబిరాలను మరిచిపోయారు.



నాలాలో పేరుకుపోయిన నీరు, చెత్తాచెదారం



కాశిబుగ్గ మధురానగర్‌లోని ఖాళీ స్థలంలో..

బల్దియా మలేరియా విభాగంలో 30 మంది శాశ్వత కార్మికులు, 150 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఒక బయలాజిస్టు, ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు హెల్త్ అసిస్టెంట్లు, 180 మంది కార్మికులు ఉన్నారు. వీరికి వేతనం ఏడాదికి రూ.4.50కోట్ల మేరకు చెల్లిస్తున్నారు. అయినా దోమల సమస్య ప్రజలకు తప్పడం లేదు. ఫాగింగ్ పరికరాలు తరచూ కంగా మరమ్మతుకు గురికావడం, కార్మికులు హాజరు వేసుకొని వ్యక్తిగత పనుల్లో నిమగ్నమవుతున్నారు. స్పెషల్ డ్రైవ్ ఊసే లేకుండా పోయింది.

### స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం

> దోమల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీల్లో ఫాగింగ్ చేపడుతున్నాం. మురికి వాడలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం.
>
> – మాధవ రెడ్డి, బయాలజిస్టు

# గ్రీవెన్స్ ఫిర్యాదులకు ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



సమస్య వింటున్న హనుమకొండ కలెక్టర్ పట్నాయక్

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

**కరీమాబాద్:** గ్రీవెన్స్ సెల్‌లో వస్తున్న ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ కోరారు. కాగా, గ్రీవెన్స్‌లో మొత్తం 125 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వినతులు సత్వరమే పరిష్కరించాలి : హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**హన్మకొండ అర్బన్:** గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్‌కు వచ్చిన వినతులను ఆమె స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీఎండబ్ల్యూఓ శ్రీను, ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ప్రభాకర్, డీడబ్ల్యూఓ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యా సంస్థలు బంద్

- వామపక్ష విద్యార్థి నాయకుల పిపులు



నినాదాలు చేస్తున్న వామపక్ష విద్యార్థి నాయకులు

**వరంగల్ చౌరస్తా:** విద్యారంగ సమస్యలు పరి ష్కారం కోసం ఈనెల 12న పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు బంద్ పాటించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేసిన అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి రోహిత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదెల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యార ప్రశాంత్, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ ఫీజులు దందా కొనసాగుతోందని, నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గూడ సాయిరాం, ఈసంపల్లి సాగర్,అర్జున్, శశిధర్ పుర్గాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

**వరంగల్ అర్బన్:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అర్బన్ మలేరియా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆవాసాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇందుకు ప్రతి మంగళ, శుక్ర వారాల్లో కార్పొరేటర్లను సమన్వయం చేసుకుంటూ డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఇంటిలో మేష్ డోర్లు, దోమ తెరలు, శరీర లేపనాలు వినియోగిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు దోహద పడుతుందన్నారు. ఎడిస్ దోమ డెంగీ వ్యాధి కారకమని, ఇది పగటి వేళల్లో సంచారించి కుట్టడం వల్ల డెంగీ జ్వరం వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్బన్ మలేరియా విభాగం ఫాగింగ్, లార్వా నివారణ కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ రాజేష్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, బలభద్ర రవి, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో కార్మికులు



వరంగల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**హన్మకొండ అర్బన్:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం హసన్‌పర్తి నుంచి కలెక్టరేట్ వరకు నల్ల చీరలు ధరించి అంగన్‌వాడీలు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం–2020 చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 45వ ఐఎస్‌సీ సిఫారసులు అమలు చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించాలని, 2018లో కేంద్ర అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు పెంచిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం ఎరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.శోభారాణి, కె.రమాదేవి, పూజారి రమాదేవి, పి.శోభారాణి, యు.రాజేశ్వరి, బుర్ర శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్‌లో..**

**కరీమాబాద్ :** సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు నలుపు దుస్తులు ధరించి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, నిర్మల, అనిత, లక్ష్మి, సత్యవతి, అరుణ, నిర్మల, కేతమ్మ, విజయ, వనిత పాల్గొన్నారు.

# 'భోజన' కార్మికుల సమ్మె ప్రారంభం

- డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా





ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

**విద్యారణ్యపురి:** సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 2022 నుంచి ఎరియర్స్‌తోపాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు వండి వడ్డించే కార్మికులు సోమవారం హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టోకెన్ సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మధ్యాహ్నం భోజనం పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వంట షెడ్లు, వంట గిన్నెలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. షరతులు లేకుండా బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నిడికొండ రజిత, కవిత, శాంత, సక్కుబాయి, సుశీల, పద్మ, అరుణ, విజయ, సమ్మక్క, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# 'స్టేషన్'లో వార్

### మాజీ ఉప ముఖ్యమంత్రుల మధ్య ముదిరిన మాటల యుద్ధం

- తారాస్థాయికి చేరిన వ్యక్తిగత ఆరోపణలు
- వేచిచూసే ధోరణిలో అధిష్టానం
- సీనియర్ ప్రజాప్రతినిధులతో పరిస్థితులపై ఆరా..
- కడియం కులంపై చర్చ జరగాలి.. : ఎమ్మెల్యే రాజయ్య
- నా పుట్టుకను ప్రస్తావించిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్సీ కడియం

**సాక్షిప్రతినిధి, వరంగల్:** జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. వ్యక్తిగత విమర్శలు ఆరోపణలు, రాజకీయంగా దుమారం రేపుతుండగా.. గులాబీ గూటిలో గుబులు పుట్టిస్తున్నాయి. కడియం శ్రీహరి దళితుడు కాదు.. అవినీతిపరుడు అంటూ ఎమ్మెల్యే రాజయ్య చేసిన ఆరోపణలపై కడియం కౌంటర్ ఎటాక్ చేశాడు. కుల ప్రస్తావనతోపాటు అవినీతి ఆరోపణలు నిరూపించాలి.. లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా 'స్టేషన్'లో ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రుల మధ్య వైరం సాగుతున్నా.. నాలుగైదు రోజులుగా అది పరాకాష్టకు చేరింది. ఆ ఇద్దరి పోటాపోటీ ప్రెస్‌మీట్‌లు, సమావేశాలతో కార్యకర్తలు, నాయకులు సైతం నియోజకవర్గంలో రెండు గ్రూపులుగా చీలిపోయి పాల్గొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధిష్టానం మాత్రం వేచిచూసే ధోరణితో ఉండటం .. మరోవైపు సీనియర్ల ద్వారా ఆరా తీస్తుండటం రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

**అటాక్, కౌంటర్ అటాక్..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య అటాక్.. కౌంటర్ అటాక్‌లు, మాటల వాగ్దాటి, మాటల యుద్ధం పెరిగింది. జానకీపురం సర్పంచ్ నవ్య వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కొంతకాలం మౌనంగా ఉన్న రాజయ్య నాలుగైదు రోజుల నుంచి కడియం శ్రీహరి టార్గెట్‌గా వాగ్దాటి పెంచారు. కడియం పద్మశాలి కులంలో పుట్టి బైండ్ల కులంలో పెరిగాడని ఆయన కులంపై చర్చ జరగాలంటున్నారు రాజయ్య. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ దళితులు రాజకీయంగా ఎదిగితే కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించారు. 14 ఏళ్లు మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఏ దళిత బిడ్డను ఎదగనీయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి దగ్గరికి వెళ్లి వర్ధన్నపేట నుంచి కావ్యకు టిక్కెట్ ఇవ్వాలని అడుగుతున్న ఆధారాలు బయటకి వస్తున్నాయంటూ.. కొత్త ఆరోపణలను తెరమీదకు తెచ్చారు. మాదిగల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్న రాజయ్య.. శ్రీహరి అవినీతిపై ఖల్‌నాయక్ అనే పుస్తకం ఉందని.. దాన్ని త్వరలో ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. ఎవరు ఏంటో తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు రావాలని రాజయ్య సవాల్ విసిరారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే రాజయ్య విమర్శలపైన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కూడా సోమవారం కౌంటర్ ఎటాక్ చేశారు. రాజయ్య స్థాయిని మరిచి వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన.. నా పుట్టుక, నా కూతురు కులాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించడం మనస్తాపానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో నేను ఎస్సీ, నా తల్లి బీసీ, నా తండ్రి ఎస్సీ అని స్పష్టం చేశారని, తల్లి సత్యం, తండ్రి అపోహ అని చేసిన కామెంట్స్ కు, ఎన్‌కౌంటర్ సష్టికర్త అన్నందుకు క్షమాపణ చెప్పాలని శ్రీహరి డిమాండ్ చేశారు. నేను ఎస్సీ అయితే నా కూతురు ఎస్సీ అవుతుందని, ఈ న్యాయ సూత్రాలు తెలియని రాజయ్య ఎమ్మెల్యేగా ఎలా ఉన్నావని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపిస్తున్న రాజయ్య నిరూపిస్తే వాటిని నియోజకవర్గ దళితులకు పంపిణీ చేస్తానని స్పష్టం చేశారు. వారం రోజుల్లో ఆ ఆస్తుల వివరాలు తేల్చి ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ అధిష్టానం ఆరా..

బజారున పడ్డ ఎమ్మెల్సీ శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్యల మధ్య రాజకీయ వైరంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్‌గా స్పందించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచి రాజకీయ ప్రత్యర్థులైన వీరిద్దరి మధ్య కొంత కాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఎమ్మెల్యేగా తాడికొండ రాజయ్య వ్యవహరిస్తుండగా.. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కడియం శ్రీహరి కూడా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్నే ఎంచుకున్నారు. 2019 సెప్టెంబర్‌లో వేర్వేరుగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శన యాత్ర రెండు వర్గాల మధ్య విభేదాలకు ఆజ్యం పోయగా.. ఆ తర్వాత పరిణామాలు కూడా మరింత దూరం పెంచాయి. ఎవరికీ వారుగా నియోజకవర్గంలో సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఫ్లెక్సీలు, ప్రొటోకాల్ వివాదం.. అంటూ ఇరువర్గాల మధ్యన తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇరవై రోజుల వరకు కూడా పరోక్షంగా ఆరోపణలు చేసుకున్న ఇద్దరు నేతలు కాస్తా ఇటీవల దూకుడు పెంచారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్వరం మరింత పెంచారు. ఈ క్రమంలో ఒక దశలో అధిష్టానం సూచనలను కూడా ధిక్కరించేందుకు వెనుకాడటం లేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు, మాజీ ఉప ముఖ్యమంత్రులు పోటీపోటీగా ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేసి బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడం దేనికి సంకేతం ? అన్న చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధిష్టానం సైతం సీరియస్‌గా ఆరా తీస్తుండటంతో.. 'స్టేషన్'లో ఏం జరుగుబోతోంది? అన్న ఆసక్తి అందరిలో కనిపిస్తుంది.

## క్లుప్తంగా

### సంరక్షలో చేరిన 'బలగం' మొగిలయ్య



కాశిబుగ్గ : 'బలగం' ఫేం మొగిలయ్య అస్వస్థతతో సోమవారం వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన మొగిలయ్య రెండు కిడ్నీలు పాడై గత కొన్నేళ్లుగా సంరక్ష ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. గత ఏప్రిల్‌లో ఛాతినొప్పి, ఆయాసం రావడంతో గుండె సమస్య ఉందని ఇక్కడి వైద్యులు గుర్తించి ప్రభుత్వ ఆదేశాలతో మొగిలయ్యను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ కొన్ని రోజులు వైద్యం పొందిన మొగిలయ్య తరువాత డిశ్చార్జ్ అయి ఇంటివద్దనే ఉంటూ సంరక్షకు వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. సోమవారం కొంత అస్వస్థతకు గురికావడంతో సంరక్ష ఆస్పత్రిలో చేరాడు. అతడిని పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా నిలకడగానే ఉందని ప్రమాదం ఏమి లేదని తెలిపారు.

### కోతుల దాడిలో పలువురికి గాయాలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ శివారులో ఉన్న వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై సోమవారం కొందరు వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా కోతులు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. ఇటీవల కొద్దిరోజులుగా ట్యాంక్‌బండ్‌పై పదుల సంఖ్యలో కోతులు ఇక్కడికి వచ్చి చేరాయి. నిత్యం ఉదయం వేళల్లో ప్రత్యేక ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్న వ్యక్తులపై కోతులు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. వెంటనే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గాయపడిన బాధితులకు చికిత్స చేయించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంధ్య రాజేష్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్‌పై కోతుల బెడదను నివారించాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

### ఆరుగురిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : ప్రేమికులు కులాంతర వివాహం చేసుకోగా, దీనికి స్నేహితుడు సహకరించాడనే నెపంతో అతడిని చంపుతామని బెదిరించి, ఇంట్లోని సామగ్రిని దహనం చేసిన కేసులో మరో ఆరుగురిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం నర్సంపేట మండలం ఇటుకాలపల్లికి చెందిన సర్పంచ్ మండల రవీందర్ కుమార్తె కావ్య అదే గ్రామానికి చెందిన రంజిత్ ఈనెల 4న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయమై హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఇరువురు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించగా తన భర్తతో కలిసి వెళ్తానని కావ్య.. రంజిత్‌తో వెళ్లింది. కాగా, ఇటుకాలపల్లికి చెందిన సామల సుజాత కుమారుడు రాకేశ్.. వీరి వివాహానికి సహకరించారని నెపంతో కావ్య తండ్రి మండల రవీందర్, భూక్య వీరన్న, బుడిగ వినయ్, ఎంపీటీసీ వీరన్న, పిట్టల శ్రీను, చెన్నారావుపేట చెందిన విజేందర్ చంపుతామని బెదిరించారు. అదే రాత్రి దాడి చేసి ఇల్లు, హోటల్ దహనం చేశారని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# ఆ పాప ఎవరు..?



- వరంగల్‌లో విదేశీ దంపతుల దత్తత వివాదం
- చెల్లిపాప అంటూ జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టి
- ఓసారి ఇన్ కంట్రీ అడాప్షన్ ఆప్షన్‌తో దరఖాస్తు
- ఇంకోసారి ఇంటర్‌కంట్రీ అడాప్షన్‌తో పిటిషన్
- వేర్వేరుగా ఉండడంతో ఆసక్తికరంగా మారిన కేసు

సాక్షి, వరంగల్: అమెరికా దంపతులు.. వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దతత్త తీసుకునే అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ పాపకు జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టించడంతో పాటు ఏకంగా వీసా తీసుకుని అమెరికాకు తీసుకెళ్లేందుకు మూడు నెలల క్రితం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించారు. ఆ తర్వాత జరిగిన దత్తత విధానమే ఇప్పుడూ అనుమానాలకు తావిస్తోంది. ఆ పాపను దత్తత ఇచ్చే విధానాన్ని వేగిరం చేయాలని కొందరు స్టేట్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సారా) అధికారులతో పాటు శిశు గృహ సందర్శన నివేదికను సమర్పించాలంటూ హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖలోని ఓ విభాగాధికారి ఒకరు అత్యుత్సాహం చూపారనే విమర్శలున్నాయి. వాస్తవానికి ఆ పాప వరంగల్ సిటీకి చెందినట్లు జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నా.. ఆ శిశువును దత్తత తీసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా హనుమకొండలోని బాలల సంరక్షణ విభాగానికి దరఖాస్తు వచ్చింది. దీంతో వరంగల్ జిల్లాలో దత్తత కార్యక్రమాలను పర్యవేక్షించే వారిని గృహ సందర్శన చేసి నివేదిక సమర్పించాలంటూ అడిగినట్లు తెలిసింది.

**అక్కడా కుదరదనే...ఇక్కడకు వచ్చి..**

అమెరికాకు చెందిన దంపతులు కరీం విరాణి, అశామా విరాణి అమెరికా నుంచి వచ్చి కొంపల్లిలో తాత్కాలిక నివాసం ఉంటున్నారు. వాస్తవానికి ఇంటర్ కంట్రీ అడాప్షన్ (ఓఏఎస్) చిల్డ్రన్ కోసం ఫారెన్ అడాప్షన్ ఏజెన్సీ(ఏఎఫ్ఏ) నోఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) సంబంధిత దేశం ఇవ్వాల్సి ఉంటుంది. 'వివిధ దేశాల్లో ఉన్న ఎంబసీలోని ఫారెన్ అథరైజ్డ్ ఏజెన్సీ (ఆపా) వద్ద పిల్లలు దత్తత కావాలని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్కడా వారి స్థితిగతులను అధ్యయనం చేశాకే ఆ దంపతులను కారాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆపా కోరుతుంది. అయితే కరీం, అశామీ విరాణి విషయంలో ఆపాను సంప్రదిస్తే అమెరికాలో ఉన్న చట్టాల ప్రకారం బతికున్న తల్లిదండ్రుల నుంచి పిల్లలను దత్తత తీసుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసినట్టు తెలిసింది. అందుకే హైదరాబాద్‌కు వచ్చిన వీరు ఇన్నర్ కంట్రీ అడాప్షన్ అనే ఆప్షన్ ద్వారా కారాలో దరఖాస్తు చేసుకున్నారు. కరీం విరాణి కొంపల్లిలో తాత్కాలిక నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి..తన సోదరి, వరంగల్‌కు చెందిన రషీదాబాను భోజని శిశువును దత్తత తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అమ్యాన్ అలీ భోజని, రషీదాబాను భోజని దంపతులకు 10, 8 ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గతేడాది ఆమె గర్భవతి కాలేదని సమాచారం. దీంతో ఆ పాప ఎక్కడి నుంచి వచ్చింది...ఎవరి పాప...కొనుగోలు చేశారా అనే దిశగా అనుమానాలు వస్తున్నాయి.

**వీరు రారు.. వారు రారు..**

వరంగల్‌కు చెందిన అడ్వకేట్ కృష్ణ ద్వారా ఈ దంపతులకు సంబంధించి దత్తత ఆదేశాలు ఇవ్వాలంటూ కలెక్టర్ ద్వారా జిల్లా సంక్షేమ అధికారికి కొద్దిరోజుల క్రితం పిటిషన్ వచ్చింది. దీనిని పరిశీలించిన జిల్లా బాలల సంరక్షణ విభాగం .. ఇంటర్ కంట్రీ అడాప్షన్ పేరేంట్స్ (పాప్స్) కిందకు వస్తుందంటూ చెబుతూనే..అథరైజ్డ్ ఫారెన్ అడప్షన్ ఏజెన్సీ(ఏఎఫ్ఏ) నుంచి నిరంభ్యంతర పత్రం సమర్పించాలన్నారు. దీని ఆధారంగానే దత్తతను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే పాప కోసం దరఖాస్తు చేసుకున్న విరాణి దంపతులు, ఆ పాప బయోలాజికల్ పేరెంట్స్ అయిన భోజని దంపతులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరు కాలేదు. ఇంకోవైపు ×హోమ్ స్టడీ రిపోర్ట్ ఇవ్వాలని లోకల్ రాజకీయ నేతల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. వరంగల్ చార్‌బౌలీకి చెందిన ఫిజియో థెరపీ షర్మిలా.. దత్తత విషయంలో పలుమార్లు అధికారులను కలిశారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అనుచరుడినంటూ శ్రీనివాస్ గౌడ్ కూడా ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం . అయితే రషీదాబాను గర్భవతి కాకపోతే ఆ పాప ఎవరనే అనుమానం కలుగుతోంది. దీన్ని నిగ్గు తేల్చే దిశగా అధికారులు దృష్టి సారించాలి.

## పార్ట్‌టైం అధ్యాపకులకు నిరాశే..

- కన్వర్షన్‌కు బ్రేక్..
- ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ బేసిక్‌లో కన్వర్షన్ చేసేందుకు యూనివర్సిటీ అధికారులు కొంత కాలం క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదించగా నిరాకరించడమేకాకుండా పార్ట్‌టైం అధ్యాపకులను కన్వర్షన్( మార్పు)గా చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఇటీవల కాకతీయ యూనివర్సిటీకి ఉత్తర్వులు పంపిన విషయం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. కొన్ని సంవత్సరాల నుంచి కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులుగా తమను కాంట్రాక్ట్‌గా మార్చాలని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడమే గాకుండా ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కొంత కాలం క్రితం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి లేఖను పంపగా ఇటీవల ఈ ఏడాది జూన్23న ఉన్నత విద్య ప్రభుత్వ కార్యదర్శి ఈ విషయంపై స్పష్టత నిచ్చారు. ఫుల్ వర్క్‌లోడ్ కలిగిన (16 పీరియడ్‌లు) పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్ట్‌గా మార్చేందుకు యూజీసీ నిబంధనలు లేవని కేయూ రిజిస్ట్రార్‌కు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో పార్ట్‌టైం అధ్యాపకులకు నిరాశే మిగిలింది. కాగా, కేయూ పరిధిలో సుమారు 200ల మందికిపైగానే పార్ట్‌టైం అధ్యాపకులుండగా అందులో ఫుల్ వర్క్‌లోడ్ కలిగిన వివిధ విభాగాలల్లో రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులలో కలిపి 120మంది వరకు పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారని సమాచారం.

## ఎంపీడీఓ హత్యపై ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు

బచ్చన్నపేట : రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై జాతీయ ఎస్సీ కమిషన్‌లో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఆధ్వర్యంలో మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు చేశారు. రామకృష్ణయ్య హత్య కేసులో పలువురు ముఖ్య నాయకులు, అధికారులను బయటకురాకుండా చూస్తున్నారన్నారు. హత్యకు గురైన వ్యక్తి దళితుడు కావడంతో పట్టించుకోవడం లేదన్నారు. ఈ హత్య వెనుక ఉన్న ముఖ్య నాయకులను అరెస్టు చేసి రామకృష్ణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.



జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి కల్పన

## అదుపు తప్పి కారు బోల్తా..

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



నల్లబెల్లి: కారు అదుపు తప్పి బోల్తాపడగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం తండాకు చెందిన గుగులోత్ రాజు, భూక్య శ్రీను, బోడ నరేశ్, గుగులోత్ అంజీ.. కారులో మండల కేంద్రానికి బయలుదేరారు. నల్లబెల్లి మధ్యలవాగువద్దకు రాగానే కారు అదుపు తప్పి వాగులో బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. కాగా, నర్సంపేట ఆర్డీవో ఆఫీస్‌కు వెళ్తున్న తహసీల్దార్ మంజుల ఘటనా స్థలిని సందర్శించారు. క్షతగాత్రులను పరామర్శించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో ఇటీవల దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన జేసీబీ ఆపరేటర్ పాండవుల అనిల్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం విదితమే. దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సమష్టి కృషితోనే 'ఏ ప్లస్' గ్రేడ్

- న్యాక్ ఏ ప్లస్‌తో కేయూకు ఎంతో ప్రయోజనం
- యూజీసీ ఫండింగ్ ఏజెన్సీల నుంచి నిధులు
- కేయూ వీసీ తాటికొండ రమేశ్



కేయూ క్యాంపస్: నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటే షన్ కౌన్సిల్ (న్యాక్ )బెంగళూరు.. కాకతీయ విశ్వవిద్యాలయానికి 'ఏ ప్లస్' గ్రేడ్ ప్రకటించిందని, దీని వల్ల యూనివర్సిటీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కేయూలోని సెనేట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. విద్యాబోధన, పరిశోధన, మౌలిక వసతులు కల్పనలో ముందుకెళ్తుందన్నారు. న్యాక్ 'ఏ ప్లస్' గ్రేడ్ రావడం వల్ల దేశంలోని ఫండింగ్ సంస్థల నుంచి పరిశోధనలకు, ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు సేకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా కేయూ స్వతంత్రంగా కొత్త కోర్సులను ప్రారంభించడానికి అధికారం ఉంటుందన్నారు.ఈ సారి దూరవిద్యకేంద్రం కూడా డుయల్ మోడ్‌లో న్యాక్ పరిధిలోనికి తీసుకొచ్చామన్నారు.దీంతో ఇక నుంచి దూరవిద్యాకేంద్రం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే వివిధ డిప్లొమా కోర్సులను కూడా యూజీసీ డెబ్ అనుమతి లేకుండానే ప్రవేశపెట్టుకునే అవకాశం కలిగిందన్నారు. విశ్వవిద్యాలయం 2003లో మొదటిసారి న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించగా, 2009లో ఏ గ్రేడ్, 2017లో ఏగ్రేడ్ సాధించిందన్నారు 2023లో 'ఏ ప్లస్' సాధించడం ఆనందంగా ఉందన్నారు. యూనివర్సిటీలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని హాస్టల్, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ నిధులు రూ. 20 కోట్లతో ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం చేపడుతామన్నారు. అలాగే, కేయూ మొదటిగేట్ నుంచి రెండో గేట్ వరకు రోడ్డును వెడల్పు చేస్తామన్నారు. దీనికి సీఎస్ఆర్ నిధులు రూ. కోటీ విడుదల అయ్యాయన్నారు. కేయూ భూమిని రక్షించడానికి యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామన్నారు. సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి శ్రీనివాస్, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆలస్యంగా స్పాట్ కౌన్సెలింగ్

- అడ్మిషన్ల ప్రక్రియకు సమయానికి చేరుకోని ఆర్‌సీఓ
- ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



కళాశాలలో అడ్మిషన్ అవుతున్న విద్యార్థినులు

ఏటూరునాగారం: ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీల భర్తీకి సోమవారం స్థానిక గిరిజన గురుకుల రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే ఉదయం 10.30 లకు సమయం ప్రకటించగా మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలోని 6 కళాశాలలో సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు స్పాట్ కౌన్సెలింగ్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని, దూరప్రాంతాల నుంచి వచ్చిన తమకు వసతులు లేవని కళాశాల యాజమాన్యం, నిర్వాహకులను నిలదీశారు. 12.30 గంటల తర్వాత మహబూబాబాద్, జయశంకర్, ములుగు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి రావడంతో స్పాట్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. సీరోలు, కేసముద్రం, మహబూబాబాద్, ఏటూరునాగారం, కొత్తగూడ, కాటారం కళాశాలల్లోని ఖాళీగా ఉన్న సీట్లకు ఆర్‌సీఓ స్పాట్ కౌన్సెలింగ్ చేపట్టింది. పదిలో 10/10 జీపీఏ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి 8 జీపీఏ ఆ తర్వాత సీట్లకు అనుగుణంగా జీపీఏలను ఆధారంగా విద్యార్థులను పిలిచి సర్టిఫికెట్లు వెరిఫై చేసి సీట్లను భర్తీ చేశారు. ఆరు కళాశాలల్లో మొత్తం 275 సీట్లు ఉండగా సోమవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్ అడ్మిషన్లలో 105 మందిని భర్తీ చేశారు. 170 సీట్లు ఇంకా ఖాళీగానే ఉన్నాయని ఆమె తెలిపారు. అయితే ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కో గ్రూపులో ఒక్కో సీటు ఉంటుంది. ఆ సీట్లు భర్తీ కాగా ఎక్కువగా షెడ్యూల్ ట్రైబ్స్ సీట్లు మిగిలిపోయాయి. ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపగా సీట్ల కోటాలో వారికి అవకాశం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఎస్సీ, బీసీ, ఓసీ సీట్లను సైతం పెంచాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అయితే నిబంధనల ప్రకారం మాత్రమే స్పాట్ అడ్మిషన్లు ఇస్తామని ఆర్‌సీఓ తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వరరాజు, ఏటూరునాగారం ప్రిన్సిపాల్ వసుంధర, కొత్తగూడ విజయ, కేసముద్రం స్వప్న, కాటారం లలితాదేవి, సీరోజు చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రేడియోస్టేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా రవికుమార్

హన్మకొండ: ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారిగా ఇల్లందుల రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టు గత రెండు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పని చేసిన గోపాల్ రావు రెండు నెలల క్రితం రిటైరయ్యారు. ఖాళీగా ఉన్న స్థానంలో ఇదే కేంద్రంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న ఇల్లందుల రవికుమార్‌కు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్(కార్యక్రమ నిర్వహణ అధికారి)గా పదోన్నతి కల్పించి ఇక్కడే నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్‌కు వరంగల్ రేడియో క్యాజువల్ కాంపెరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటె చిరంజీవి, క్యాజువల్ అనౌన్సర్స్ పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ రేడియో క్యాజువల్ కాంపెరర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అర్షం సదానందం , గౌరవ అధ్యక్షుడు జనార్ధన్, కోశాధికారి కుమార్, ఉపాధ్యక్షుడు గాదె శ్యామ్, ప్రచార కార్యదర్శి సందెల కిషోర్, కల్చరల్ కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సతీష్, మాలతి, గడ్డం శోభారాణి, భాగ్యలక్ష్మి, స్వప్న కుమారి పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న క్యాజువల్ అనౌన్సర్స్



## ధర పెరిగినా.. ఫీజు అంతే

- అకాశాన్నంటిన టమాట రేట్
- అయినా పెరగని మార్కెట్ ఫీజులు
- ఆదాయంపై దృష్టి సారించని యంత్రాంగం



డీసీఎంల్లో వచ్చిన టమాట బాక్సులు

వరంగల్: ప్రస్తుతం దేశ వ్యాప్తంగా టమాట ధర అకాశాన్నంటింది. అయినా వరంగల్ మార్కెట్‌కు వచ్చే ఫీజు మాత్రం పెరగడం లేదు. సాధారణంగా వరంగల్‌లోని లక్ష్మీపురం మార్కెట్‌కు రోజూ 10-15 డీసీఎంలలో టమాట బాక్సులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేది. బాక్స్ ధర రూ.250-300 వరకు ఉండడంతో డీసీఎంలలో 300 వచ్చిన బాక్సులకు టోకుగా మొత్తం ధర రూ.35లు నిర్ణయించి మార్కెట్ ఫీజులు వసూలు చేసేవారు. ధరలు అకాశాన్నంటుండడంతో ఇద్దరు ముగ్గురు వ్యాపారులు కలసి ఒక్కో డీసీఎం తెప్పిస్తున్నారు. దీంతో రోజూ ప్రస్తుతం 3, 4 డీసీఎంలు వస్తున్నాయి. వీటిల్లో 1000-1400 బాక్సుల టమాట వస్తోంది. ఇప్పుడున్న ధర ప్రకారం ఒక్కో బాక్సు రూ.2వేలు పలుకుతోంది. ఈలెక్కన రోజు వచ్చే టమాట బాక్కుల విలువ రూ.20-28లక్షల వరకు ఉంటోంది. ఈ లెక్కన ఒక్క శాతం మార్కెట్ ఫీజు అంటే మొత్తం రూ.20నుంచి రూ. 28వేల వరకు మార్కెట్ కమిటీకి ఆదాయం లభించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారుల ఒత్తిళ్లతో మార్కెట్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఫీజులు వసూలు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ధర పెరిగినా, అదే విధంగా డీసీఎంకు పాత లెక్కన రూ.450 మాత్రమే వసూలు చేస్తుండడంతో మార్కెట్ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పడుతోందని సమాచారం. టమాట పరిస్థితి ఇలా ఉంటే పచ్చిమిర్చి కూడా అదేదారిలో ఉంది. నిత్యం సుమారు 400 పచ్చిమిర్చి బస్తాలు అంటే సుమారు రూ.20లక్షల విలువైన సరకు వస్తోంది. అంటే మార్కెట్ ఫీజు రూ.20వేలు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ కూడా కేవలం వాహనాల లెక్కన రూ.120-300 వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంటే టమాట, పచ్చిమిర్చితో నిత్యం రూ.40-50 వేల వరకు ఫీజు రూపంలో మార్కెట్ కమిటీ ఆదాయం కోల్పోతోంది.

**వ్యాపారుల దయాదాక్షిణ్యాలపైనే..**

కూరగాయల మార్కెట్‌లో అద్దెలు, మార్కెట్ ఫీజుల వసూళ్లు పూర్తిగా వ్యాపారుల దయాదాక్షిణ్యాలపైనే ఉండడంతో ఇస్తే తీసుకోవడం.. లేదంటే వెళ్లిపోవడం సిబ్బందికి ఆనవాయితీగా మారింది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితులు నెలకొనడంతో మార్కెట్‌లో ఏ సూపర్‌వైజర్ వచ్చినా ప్రయోజనం లేకుండా పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తే తప్ప ఆదాయం పెరిగే సూచనలు కనపడడం లేదని చర్చ సాగుతోంది. మార్కెట్ సూపర్‌వైజర్ వెంకన్నను వివరణ కోరగా బాక్సుల ప్రకారం మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నామని తెలిపారు.

# కనీస వసతులు కల్పించండి..

- గ్రేటర్ గ్రీవెన్స్‌లో ప్రజల విజ్ఞప్తి
- వినతులు స్వీకరించిన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ఆస్తి, నీటి, చెత్త పన్నులు చెల్లిస్తున్నా కాలనీల్లో కనీస వసతులు కరువయ్యాయని ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్వీకరించారు. మొత్తం 62 వినతులు రాగా.. అందులో ఇంజినీరింగ్ సెక్షన్‌కు 15, హెల్త్- శానిటేషన్‌కు 5, పన్నుల విభాగానికి 16, టౌన్ ప్లానింగ్‌కు 24, తాగునీటి సమస్యపై 2 చొప్పున ఉన్నాయి. అడిషనల్ కమిషనర్లు రవీందర్‌యాదవ్, అనిసుర్ రషీద్, ఆర్ఎఫ్ఓ పాపయ్య, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీఎంహెచ్ఓ రాజేష్, సీహెచ్ఓ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, జోనా, ఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

**గ్రీవెన్స్ వినతులకు ప్రాధాన్యం ఇవ్వాలి : కమిషనర్**

గ్రీవెన్స్‌కు వచ్చే వినతులకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. వింగ్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారుడు కార్యాలయం చుట్టూ తిరుగకుండా వేగంగా సమస్యలు పరిష్కరించాలని, ప్రతీనెల 3వ శనివారం వివిధ విభాగాల అధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించి ఈ-ఆఫీస్ ఫైళ్లు, టప్పా, యాప్ ద్వారా నమోదయ్యే ఫిర్యాదులపై చర్చించాలని, ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టాలని చెప్పారు. పన్నుల వసూలుకు సంబంధించిన డిమాండ్ నోటీసులను బుధవారంలోగా అందజేయాలని, లేకపోతే కొరియర్ ద్వారా చేరవేసి ఆ సమాచారాన్ని ఎస్ఎంఎస్ రూపంలో తెలియజేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌కు సంబంధించి నగర పరిస్థితులపై సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, ఇందుకు మెప్మా ఎస్ఎల్ఎఫ్‌లు, మహిళా సంఘాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం పూర్తిస్థాయి ఇంకా మొదలవలేదని పెండింగ్‌లో ఉన్న డీ-సిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని, టీఎస్-బీపాస్ దరఖాస్తులను డిప్యూటీ కమిషనర్లు మానిటరింగ్ చేయాలని కోరారు. బీసీల లక్ష రూపాయల ఆర్థిక సాయం దరఖాస్తులను క్లియర్ చేయాలని పేర్కొన్నారు.

**ఫిర్యాదుల వివరాలు..**

- 1వ డివిజన్ లక్ష్మీనగర్, గుండ్లసింగారంలో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.
- ఈనెల 12న హైదరాబాద్‌లో పురపాలక శాఖ డైరెక్టర్‌తో కార్మికుల సమావేశం ఉందని, పారిశుద్ధ్య కార్మికులకు అనుమతి ఇవ్వాలని సీఐటీయు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.
- 31వ డివిజన్ హంటర్ రోడ్డు హిల్స్ కాలనీలో విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని కార్పొరేటర్ మామిండ్ల రాజు వినతిపత్రాన్ని అందజేశారు.
- 36వ డివిజన్ చింతల్‌లో కనీస సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- గోపాల్‌పూర్ లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు.
- 40వ డివిజన్ దొడ్డి కొమురయ్యనగర్‌లో ముంపునకు గురికాకుండా డ్రెయినేజీ నిర్మించాలనీ కాలనీవాసులు కోరారు.
- 1వ డివిజన్ కాకతీయనగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండలోని టీబీ ఆస్పత్రి వెనుక కాలనీలో నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఫిర్యాదు చేశారు.
- రెడ్డిపురం కాకతీయ కెనాల్ పక్కన సెప్టిక్ ట్యాంకు వాహనాల అడ్డా కోసం స్థలం ఇప్పించాలని ఆపరేటర్లు విజ్ఞప్తి చేశారు.
- 55వ డివిజన్ భీమారంలో మురుగు, వరద నీరు ఇళ్లలోకి చేరకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 62వ డివిజన్ సామిడి మై హోమ్ డ్రీమ్ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్పొరేటర్ రవీందర్‌యాదవ్ కోరారు.
- కాజీపేట విష్ణుపురిలో రోడ్డు, డ్రెయినేజీ మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదు అందజేశారు.
- 55వ డివిజన్ భీమారం శ్రీనగర్ కాలనీలో రోడ్డు, డ్రెయినేజీ మంజూరు చేయాలని కాలనీవాసులు దరఖాస్తు అందజేశారు.
- 55వ డివిజన్ శ్యామల చెరువు ఎఫ్‌టీఎల్‌లో భవన నిర్మాణాలను నిలిపేయాలని పలువురు ఫిర్యాదు చేశారు.
- 37వ డివిజన్ హంటర్ రోడ్డు ఖమ్మం రోడ్డు ఫ్లై ఓవర్ కింద ఉన్న గాయత్రినగర్‌లో సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు కోరారు.

## భీమారంలో చోరీ..

- 24 తులాల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ

హసన్‌పర్తి: నగర పరిధి 55వ డివిజన్ భీమారంలో చోరీ జరిగింది. ఈమేరకు బాధితుడు సోమవారం కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భీమారానికి చెందిన ఎండీ.సాధిక్ ప్రైవేట్ ఉద్యోగి. ఆయన కూతురు అనారోగ్యంతో బాధపడుతుండగా.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కూతురును చూడానికి ఈనెల 8న సాధిక్ హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి ఆదివారం అర్ధరాత్రి ఇంటికి వచ్చే సరికి తలుపు ధ్వంసమై కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుళ్లగొట్టి అందులోని 24 తులాల బంగారు నగలు, రూ.3లక్షలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.